

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# ప్రజాగోస బిజెపి భరోసా

-రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



**పరిగి ఫిబ్రవరి16,ప్రభాతవార్త :**
వికారాబాద్ జిల్లా పరిగి మండలం రూప్‌ఖాన్ పేట్ గ్రామంలో ప్రజా గోస బిజెపి భరోసా కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హాజరైయ్యారు.ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ....సిఎం కెసిఆర్ మోసగాళ్లకు మోసగాడు మోసం చేయడంలో పెద్ద దీట్ట,రాష్ట్రంలో టిఆర్ఎస్‌ను వానికించే పార్టీ బిజెపి అని పేర్కొన్నారు.,ఉద్యోగులకు సరిగా జీతాలు ఇవ్వలేనోడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలేలా అమలు చేస్తారని ప్రశ్నించారు.ఐదు లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని ముంచాడు అన్నారు.మళ్లీ గెలిపిస్తే పది లక్షల అప్పులు చేస్తాడని అన్నారు.కేంద్రం నుంచి వచ్చిన పంచాయతీ నిధులను పంచాయతీ నిధులకు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని కెసిఆర్ మీద మండిపడ్డారు.ఈసారి ఒంటరిగా గెలవమని భయంతో ఎంఐఎం,కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేసి బిజెపిని ఓడించాలని ప్రయత్నం చేస్తున్నారని ఎవరేని కుట్రలు చేసినా రజాకారులను తరిమి తరిమి కొడతామని వచ్చేది బిజెపి పాలనేనని పేదల రాజ్యం తీసుకొస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఏ.చంద్రశేఖర్,మాజీ ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి,రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి,రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్ గౌడ్,జిల్లా అధ్యక్షుడు సదానంద రెడ్డి,కార్యదర్శి ఉమారాణి,ఆకుల విజయ జిల్లా అధికార మోర్చా ప్రతినిధి సరిత రాఘవేందర్,మిట్ట పరమేశ్వర్ రెడ్డి,డాక్టర్ జానకి రామ్,సర్పంచ్ నరసింహ,బూత్ అధ్యక్షుడు శ్రీనివాస్ ,యాదయ్య,తదితరులు పాల్గొన్నారు.

## శిలాఫలకాలకే పరిమితమైన రోడ్డు

**-కంకర పరిచారు...బీటీ మరిచారు**

**-నాలుగున్నర సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకోని సంబంధిత అధికారులు : సర్పంచ్**

**కొత్తూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :**
కొత్తూర్ మండలంలోని పెంజర్ల నుండి సుభాన్‌పూర్ వెళ్లే రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి నాలుగున్నర సంవత్సరాలు గడుస్తున్న కూడా నేటికి పూర్తి అవలేదు. రహదారి నిర్మాణానికి కంకర పరిచి దానిపై దంబర్ వేయకుండా వదిలేశారు. దీంతో రహదారిలో ప్రయాణించే ప్రయాణికులు ఆయా గ్రామాల గ్రామస్థులు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ మా ఊరి రోడ్డు బాగుపడాలంటే ఇంకా ఎన్ని సంవత్సరాలు పడుతుందో అర్థం కావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ప్రయాణికులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయంపై గ్రామ సర్పంచ్‌ను సంప్రదించగా సంబంధిత అధికారులు పట్టించుకుని సత్వరమే సుభాన్‌పూర్ నుండి పెంజర్ల రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసి బీటీరోడ్డు వేస్తే ప్రజల కష్టాలు తీర్చాలని ఇందుకోసం శక్తివంచన లేకుండా తమవంతు కృషి చేస్తునే ఉన్నామని సత్వరమే ఈరోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చూస్తామన్నారు.



కంకర తేలిన రోడ్డు



శిలఫలకం

# 22నుంచి 28వ తేదీ వరకు డిఐఇఎల్ఇడి మొదటి సంవత్సరం పరీక్షలు : డిఇఓ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 16, ప్రభాతవార్త**
ఈ నెల 22నుంచి 28వ తేదీ వరకు డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డిఐఇఎల్ఇడి) మొదటి సంవత్సరం పరీక్షలు జరుగనున్నట్లు మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగనున్నట్లు ఆమె వివరించారు. ఈ పరీక్షల కోసం ధరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. బిఎస్‌సి. తెలంగాణ.జిఓవి.ఇన్ ద్వారా డౌన్లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరు కావాలన్నారు. ఈ హాల్‌టికెట్లను 15వ తేదీ నుంచే అందుబాటులో ఉన్నట్లు డిఇఓ విజయకుమారి పేర్కొన్నారు.

# కీసరగుట్టలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు షూరూ



కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వర పూజలో పాల్గొన్న ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ దంపతులు

**కీసర,ఫిబ్రవరి16,ప్రభాతవార్త:**
తెలంగాణాలోనే సుప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు గురువారం విఘ్నేశ్వర పూజతో ప్రారంభమైనాయి.వేద పండితుల మంత్రోచ్ఛరణలతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ మహమండపంలో విఘ్నేశ్వర పూజ అనంతరం పుణ్యాహవచనము,రుత్విక్ వరణం,యాగశాల ప్రవేశం, అఖండ స్థాపన,సాయంత్రం అగ్ని ప్రతిష్టాపన ,భేరీపూజ, ధ్వజారోహణ,ద్వాత్రింశతి రాగాలాపన,నీరాజన,మంత్ర పుష్పం,తీర్థ ప్రసాద వినియోగము,రాత్రి 8 గంటలకు శ్రీ రామలింగేశ్వర స్వామి వారు గుట్ట నుంచి కీసరకు విచ్చేయుట తదితర కార్యక్రమాలు జరిగాయి.ఈ కార్యక్రమంలో జడ్పి వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, ఎంపిపి మల్లారపు ఇందిర లక్ష్మీనారాయణ,సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్,ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్మన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్,మండల పార్టీ అధ్యక్షులు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి,పిఎసిఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి,నాయకులు దుర్గం సాయినాథ్‌గౌడ్,గుర్రం లక్ష్మారెడ్డి,ఆంజనేయులు,రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**నేటి పూజా కార్యక్రమాలు :**
కీసరగుట్టలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండరోజు పూజా కార్యక్రమాల్లో భాగంగా ఉదయం 9 గంటలకు రుద్ర స్వాహకార హోమం,సాయంత్రం 4 గంటలకు బిల్వార్చన,5 గంటలకు రుద్రస్వాహకార హోమం,రాత్రి 7 గంటలకు ప్రదోషకాల పూజ,నీరాజన,మంత్రపుష్పం,తీర్థ ప్రసాద వినియోగం,రాత్రి 8 గంటలకు శ్రీ స్వామివారు కీసర గ్రామం నుండి కీసరగుట్టకు విచ్చేయుట,9.30 నిమిషములకు ఉత్తరాషాఢ నక్షత్రయుక్త కన్యా లగ్న మందు శ్రీ భవానీ శివదుర్గా సమేత రామలింగేశ్వరస్వామి వార్ల కళ్యాణ మహోత్సవము తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**మహాశివరాత్రి బ్రహ్మోత్సవ క్రీడలు ప్రారంభం :**
ప్రతి సంవత్సరం కీసరగుట్టలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల క్రీడోత్సవాలు విజయవంతం చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పేర్కొన్నారు.గురువారం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు.విద్యార్థులు కసి తోటి ఆటలు ఆడితేనే విజయం సాధిస్తారన్నారు.ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 7300 కోట్లు కేటాయించిందన్నారు.విద్యార్థులు విదేశీ చదువులు చదివితే 20 లక్షల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు.తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఇప్పుడు ఇంత ఉన్నత స్థాయికి ఎదిగిన వ్యక్తిని అని తెలిపారు.విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ రవి,జడ్పి వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్,సర్పంచ్ నాయకపు మాధురి,ఎంపిటిసి తటాకం నారాయణశర్మ,ఎంఈఓ శశిధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



కీసరగుట్టలో బ్రహ్మోత్సవాల క్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

# నిర్ణీత సమయంలో అన్ని పనులు పూర్తి చేయాలి

**జిల్లాల కలెక్టర్లతో సిఎస్ శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్**



వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్, జిల్లా అదనపు కలెక్టర్లు, అధికారులు

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ఫిబ్రవరి26 నాటికి పట్టణ ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూం ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు.గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో కలిసి కంటి వెలుగు,పోడు భూములు ప్రభుత్వ జిఓల ప్రకారం చేయవలసిన క్రమబద్ధీకరణ,తెలంగాణకు హరితహారం,రెండు పడక గదుల నిర్మాణాలపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు.ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ..జిల్లాలో కంటి వెలుగు శిబిరాల నిర్వహణ పట్ల శ్రద్ధ వహించాలని రానున్న వేసవి దృష్టిలో ఉంచుకొని శిబిరాల వద్ద అవసరమైన చల్లని నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచడం వంటి ముందు జాగ్రత్త ఏర్పాటు చేయాలని అన్నారు.జిల్లాలకు కంటి వెలుగు ప్రిస్క్రిప్షన్ కళ్ళద్దాల పంపిణీ జరుగుతుందని,వాటిని సదురు లబ్ధిదారులకు అందించిన తరువాత లబ్ధిదారుని ఫోటో వైబ్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. రాష్ట్రంలో జీహెచ్‌ఎంసి మినహాయించి పట్టణ ప్రాంతాలలో నిర్మించిన 42 వేలకు పైగా రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణాల లబ్ధిదారులను కేటాయింపు చేయవలసి ఉండగా,ఇప్పటి వరకు 6 వేల 620 మాత్రమే జరిగిందని ఫిబ్రవరి26 నాటికి పెండింగ్‌లో ఉన్న ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సిఎస్ అన్నారు. ప్రభుత్వం అందించిన ప్రో ఫార్మ 1 ప్రకారం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమాచారం త్వరితగతిన అందించాలని,అధికారులు వారి దగ్గర ఉన్న సమాచారం మేరకు నివేదిక తయారు చేయాలని తెలిపారు.పోడు భూముల పట్టాల పంపిణీ కొరకు జిల్లా స్థాయి కమిటీ వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు త్వరగా ఆమోదించాలని సిఎస్ సూచించారు.తెలంగాణకు హరితహారం క్రింద వచ్చే సంవత్సరంలో అవసరమైన మొక్కల పెంపకం నర్సరీలో పూర్తి చేయాలని సిఎల్ అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా జీఓ 58 ప్రకారం ఆమోదించిన దరఖాస్తుదారుల పట్టాలను స్థానిక మంత్రి ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో పంపిణీ పూర్తి చేయాలని సిఎస్ ఆదేశించారు.పెండింగ్ దరఖాస్తుల ధృవీకరణ పూర్తి చేయాలని ఫీల్డ్ వెరిఫికేషన్ వంద శాతం పూర్తి కావాలని అన్నారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి,అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ,డిఆర్ఓ అశోక్ కుమార్,డిపిఓ తరుణ్ కుమార్,డిఆర్డిఓ కృష్ణన్,డిటిడబ్ల్యుఓ కోటాజీ,పంచాయతీరాజ్ ఇఇ శ్రీనివాస్ రెడ్డి,ఆర్అండ్‌బి ఇఇ లాల్ సింగ్,ఆర్డివో విజయ్ కుమారి,పరిగి కొడంగల్ ,వికారాబాద్ మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస్,పవన్ కుమార్,శరత్‌చంద్ర,అటవీశాఖ అధికారి అరుణ,తదితరులు పాల్గొన్నారు.

**మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :** జిల్లా వ్యాప్తంగ అన్ని పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. నగరం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కంటి వెలుగు కళ్లఅద్దాల పంపిణీ త్వరగా పూర్తి చేయాలన్నారు. జిఓ 58 అర్హులకు భూక్రమబద్ధీకరణ పత్రాలు పంపిణీని ప్రారంభించాలన్నారు. జిఓలు 58,59,118 ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం చేయాల్సిన క్రమబద్ధీకరణ, తెలంగాణకు హరితహారం, డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలపై సిఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగ జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగ పనులను వేగవంతం చేయటానికి కృషి జరుగుతుందన్నారు. ప్రభుత్వం సూచించిన అన్ని విషయాలను తప్పకుండ పాటిస్తామన్నారు. ఈ విషయంలో జిల్లా అధికారులు పూర్తి స్థాయిలో సిద్ధంగ ఉన్నారని అన్నారు. జిల్లా వ్యాప్తంగ 58,59 ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 58జిఓలో 9,169ధరఖాస్తులు ఉండగ వీటిలో అన్నింటిని అప్రూవ్ పూర్తి చేశామన్నారు. జిఓ 59లో 5,743ధరఖాస్తులు ఉండగ వాటన్నింటిని శనివారం లోగా పూర్తి చేస్తామని వివరించారు. దీంతో పాటు 118జిఓ కింద 2,669ధరఖాస్తులు వచ్చినట్లు వాటిని పదిహేను రోజుల్లో పూర్తి చేసి క్లియరెన్స్ ఇస్తామని కలెక్టర్ అమోయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, అభిషేక్ ఆగస్త్య, డిఆర్ఓ లింగ్యానాయక్, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్, డిఎఫ్ఓ జానకిరామ్, డిఆర్‌డిఓ పద్మజారాణి, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# తండ్రి కొడుకులు పేదల భూములను అడ్డగోలుగా అమ్ముకుంటున్నారు..

**-మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్**



హాత్ సే..హాత్ జోడో కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

**వికారాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
సీఎం కేసీఆర్, అతని కుమారుడు కేటీఆర్ లు కలిసి పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను అడ్డగోలుగా అమ్ముకుంటున్నారని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ఆరోపించారు. గురువారం ధారూరు మండలం నాగసన్‌పల్లి, తరిగోపుల గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన హత్ సే.. హత్ జోడో అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ, జిల్లాలోని నవాబుపేట్ మండలంలో 900 ఎకరాల ప్రభుత్వ భూమిని లబ్దిదారుల వద్ద నుంచి రూ.12 లక్షలకు ఎకరం లెక్కన కొనుగోలు చేసి కేటీఆర్ దోస్తులకు ఎకరం రూ.80 లక్షలకు అమ్ముకున్నారని ఆరోపించారు. మోమిన్‌పేట్ మండలం ఎన్కతల వద్ద 1200 ఎకరాల భూమిని అమ్మకానికి సిద్ధం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి నియంత పాలనకు స్వస్థి పలికే రోజులు దగ్గరలో ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అసైన్డ్ భూముల లబ్దిదారులకు యాజమాన్య హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్ర స్పూర్తితో ఏఐసీసీ, టీపీసీసీ అదేశాల మేరకు ఈ కార్యక్రమన్ని ప్రారంభించిడం జరిగిందని తెలిపారు. వికారాబాద్ నియోజకవర్గం లోని ప్రతి గ్రామానికి, ప్రతి గడపకు రాహుల్ గాంధీ సందేశాన్ని తీసుకెళ్తామని పేర్కొన్నారు. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నికల సమయంలో లెక్కలేని హామీలు ఇచ్చారని, ఏ ఒక్క హామీ కూడా ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. మాటలతో మాయ చేసి అర చేతిలో మాయా జాలం చూపించిన ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే..ఏక కాలంలో రూ.2 లక్షలు రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. రైతు బంధు సైతం ఎకరానికి 10 వేల నుంచి 15 వేలు పెంచి ఇస్తామని అన్నారు. బీజేపీ మతాల పేరుతో దేశాన్ని విధ్వంసం చేసే కుట్ర చేస్తుందని అదేవిదంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ రాష్ట్రాన్ని అదొగతి పాలు చేస్తుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జాతీయ నాయకులు కోల్కుంద సంతోష్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు చామల రఘుపతిరెడ్డి, అయ్యుబ్‌అన్సారీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు యువకులకు మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ కండువాలు కప్పి ఆహ్వానించారు.

## ఆగపల్లిలో జోరుగా మట్టి దందా

**-అనుమతులు గోరంత..తవ్వకాలు కొండంత**

**-పటించుకోని మైనింగ్ అధికారులు**

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త: మంచాల మండల పరిధిలోని ఆగపల్లిలో జోరుగా మట్టి దంద సాగుతోంది.2వేల టన్నులకు అనుమతులు తీసుకోని సుమారు 10వేల టన్నులు తవ్వకాలు జరిపారు.భారీ టిప్పర్లతో రాత్రింబవళ్లు ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు జరుతున్నాయి.అడ్డగోలు మట్టి తవ్వకాలపై ఆగపల్లి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మైనింగ్ అధికారులు ఆమ్యమ్యాలు తీసుకోని అనుమతులు ఇచ్చాక అటువైపు కూడ చూడటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. వెంటనే వైనింగ్ అధికారులు స్పందించి అనుమతులు తీసుకున్న దానికంటే ఏక్కువ తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆగపల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు.



అనుమతులు తీసుకున్న దానికంటే ఎక్కువగా మట్టి తవ్వకాలు జరుపుతున్న దృశ్యం

## అక్రమాలకు పాల్పడిన కార్యదర్శిని తొలగించాలని వినతి

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ పంచాయతీ కార్యదర్శి ఉష అవకతవకలకు పాల్పడిందని ఆమెను విధుల నుంచి తొలగించాలని బిజెపి నాయకులు గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షులు పట్లోళ్ల విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ మండలానికి చెందిన పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కార్యదర్శి నకిలీ రశీదులు సృష్టించి ఇళ్ల నిర్మాణదారుల నుంచి డబ్బులు వసూలు చేసి తప్పుడు బిల్లులు, పత్రాలు ఇచ్చి మోసం చేశారని తెలిపారు. ఎదులాబాద్ గ్రామానికి చెందిన బాధితులు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారని వారు కలెక్టర్‌కు తెలియజేశారు. కార్యదర్శి ఉషను బదిలీపై పంపించకుండా విధుల నుంచి తొలగించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మండల బిజెపి అధ్యక్షులు చలువాది ప్రవీణ్‌రావు, ఎదులాబాద్ గ్రామ అధ్యక్షులు ఎర్రోళ్ల కుమారస్వామి, వార్డుసభ్యులు బేలె సురేశ్, నాయకులు అలివాదా సాయికిరణ్, కొమటిరెడ్డి ప్రవీణ్‌రెడ్డిలు ఉన్నారు.



జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి తదితరులు

# శ్రీలక్ష్మీనరసింహస్వామి కళ్యాణం కమనీయం





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

**తలకొండపల్లి ఫిబ్రవరి16,ప్రభాతవార్త :**
ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, జడ్పిచైర్‌పర్సన్ తీగల అనిత రెడ్డి పేర్కొన్నారు.తమ నిధులతో ఆలయా అభివృదికి నిధులు మంజూరు చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. గురువారం రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో వేదాద్రి గుట్టపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం గురువారం అంగరంగ వైభవంగా కనుల పండుగగా జరిగింది.ఈ కళ్యాణోత్సవానికి ఆలయ నిర్వాహకులు విశాల వసతులు ఏర్పాటు చేశారు.ప్రతి ఏటా స్వామివారికి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తుంటారు. దాతల సహకారంతో దాదాపు రూ.4కోట్లతో నిర్మించిన ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజస్తంభ ప్రతిష్టతో పాటు నవ నరసింహ విగ్రహాలు,గణపతి,సుబ్రహ్మణ్యస్వామి గరుత్మంతుడు,ఆదిశంకరాచార్యుల విగ్రహాలను ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు.స్వామివారం కళ్యాణోత్సవానికి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు పుష్పలతో,పచ్చటి తోరణాలతో అందంగా అలంకరించారు.ఆలయ ప్రాంగణంలో కళ్యాణమండపం ఏర్పాటు చేసి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు ధరించి మంటపానికి తీసుకోచ్చారు.వేద పండితులు మంత్రోచ్చరణలతో మంగళ వాయిద్యాలతో ఆలయ ధర్మకర్త నరసింహ శాస్త్రి శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో స్వామి వారి కళ్యాణాన్ని ఘనంగా జరిపించారు.ఈ కల్యాణోత్సవానికి ముఖ్యఅతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్,జాతీయ బిసి కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, జడ్పిచైర్మన్ తీగల అనిత రెడ్డిలు హాజరయ్యారు.కళ్యాణాన్ని తిలకించి స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కళ్యాణోత్సవానికి మహిళలు,భక్తులు సమీప గ్రామాలతో పాటు మహబూబ్‌నగర్,నాగర్ కర్నూల్,జిల్లాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో కళ్యాణానికి హాజరై కళ్యాణాన్ని తిలకించి స్వామి వారిని దర్శించుకున్నారు.అనంతరం భక్తులకు శతాబ్ధి టౌన్‌షిప్ అధినేత శ్రీనివాస్ రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగీత శ్రీనివాస్ యాదవ్,కల్వకురినత మున్సిపల్ చైర్మన్ ఎడమ సత్యం,జడ్పిటిసి ఉప్ప వెంకటేష్,ఎంపిపి నిర్మల శ్రీశైలం గౌడ్,టిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపిపి సిఎల్ శ్రీనివాస్ యాదవ్ ,ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి,వైసిపి తాలూకా ఇంచార్జీ చీమర్ల అర్జున్ రెడ్డి,ఎంపిటిసి అంబాజీ ,సింగల్ విండో వైస్ చైర్మన్ కూన రవి కుమార్,ఉప సర్పంచ్ అజీజ్,వైస్ ఎంపిపి శ్రీనివాస్ రెడ్డి,నాయకులు విష్ణు వర్ధన్ ,అశోక్ గుప్తా,ఆలయ ధర్మకర్త నరసింహ శాస్త్రి,గోపాల కృష్ణ,వెంకట్ రెడ్డి,కిషన్ రావు, యాదగిరి ,కృష్ణయ్య గౌడ్,అశోక్,వెంకట్ రెడ్డి ,శ్రీను, మారుతీ, మణికంఠ, విజయ్ కుమార్,సంతోష్,రాజు,భాస్కర్, హరిప్రసాద్,శ్రీరాములు, సాయి,రాధాకృష్ణ,వెంకట రెడ్డి,యాదగిరి,అశోక్,తదితరులు పాల్గొన్నారు.

